# నాటకం

## ఇచ్ఛాపురపు జగన్నాధరావు

"రాత్రి తిరిగి వొచ్చేసరికి ఆలశ్యం అవుతుంది. అంతసేపూ నువ్వు ఒంటరిగా వుండాలి..." అన్నాడు శరత్.

"అంత జాలిపడక్కరలేదులెండి. నేను రాజీ ఇంటికి వెళ్తాను" అంది రేవతి.

శరత్ ఆశ్చర్యంగా చూశాడు.

"రాజీ ఇంటికా? అంతసేపూనా? మీ ఇద్దరికీ అంతగా — అదేలే. స్నేహం లేదనుకున్నాను!" అన్నాడు.

"అవసరం నాది. తప్పదు కదా!" అంది రేవతి.

"ఆనంద్‌ని నువ్వు చూసి కూడా చాలా కాలం అయింది" అన్నడు శరత్ చిరునవ్వు అప్పుతెచ్చుకుని.

"అవును" అంది రేవతి అతని వంక చూడకుండా.

ఒక్కసారి వెనక్కి తిరిగి ఆమెని దగ్గరగా తీసుకుని "రేవతీ! ఎందుకిదంతా? నాతో వొచ్చేస్తే నీకీ శ్రమ వుండదు కదా!" అన్నాడు.

"మీరు ఇంట్లో వుండిపోతే మీకూ, నాకూ కూడా శ్రమ వుండదు కదా!" అంది రేవతి.

"గాడ్! మళ్ళీ అదే మాట?" అన్నాడు శరత్ అప్పు తెచ్చిన చిరునవ్వు తిరిగి ఇచ్చేసి స్వంతమైన విసుగు దాచుకోలేకుండా.

"సరే, ఇంక ఏ మాట అనను. కాఫీ తాగి వెళ్ళండి" అంది రేవతి.

శరత్ టైము చూసుకుని "అరే! చాలా ఆలశ్యం అయిపోయింది. బయలుదేరాలి" అంటూ తన బేగ్ తీసుకున్నాడు.

"కాఫీకి టైము వుంటుంది" అంది రేవతి.

"లేదు. ఈసరికి అక్కడ ఉండాల్సింది!" అన్నాడు బేగ్ తెరిచి అందులో తనకి కావలసినవన్నీ వున్నాయని చూసుకుంటూ.

"నాటకం ఆరున్నరకి కదా!" అంది రేవతి.

"నాలుక్కి అక్కడ వుండాలి. ఇప్పుడే నాలుగు దాటింది. నువ్వు వొస్తానంటే ఆగుతాను. కమాన్! సరదాగా వుంటుంది. రా!" అన్నాడు శరత్ గుమ్మంలో నిలబడి.

"నా కళ్ళారా అదంతా చూస్తేకాని మీకు సంతృప్తి వుండదు!" అంది రేవతి పరుషంగా.

"పోనీ అలాగే అనుకో! చలో!"

"నా కక్కడ జరిగే నాటకం అంతా చూడాలని లేదులెండి! మీ కోసం వాళ్ళందరూ కాసిపెట్టుకుని కూర్చుని వుంటారు. వెళ్ళండి" అంది రేవతి.

ఇంక వెనక్కి చూడకుండా శరత్ వెళ్ళి స్కూటరు మీద బయలుదేరేడు. అతనికి రేవతి మీద కోపంగానూ ఆ పరిస్థితి చూసి బాధగానూ వుంది.



అజంతా కళాసంగమమ్ వాళ్ళు వేసే నాటకంలో ముఖ్య పాత్ర అతనిది. ఈ రోజు సంగమంవాళ్ళ వార్షికోత్సవం. మంచి నాటకం దొరికింది. రాసినవాడు సురేష్. అతను కూడా సభ్యుడే. చక్కటి కథ రాశాడు. డైలాగులు ఎంతో బాగున్నాయి. అందులో ముఖ్యమైన పాత్ర తనకి రావడం చాలా అదృష్టంగా భావించి శరత్ అంగీకరించేడు. అదంతా రెండు నెలల కిందట.

స్క్రిప్టు ఇంటికి తేగానే రేవతి చదివింది.

"ఎలా వుంది?" అన్నాడు శరత్.

"ఎక్సలెంట్! చాలా పవర్‌ఫుల్‌గా వుంది" అంది రేవతి.

"నాకూ అలాగే అనిపించింది" అన్నాడు శరత్.

"మీరు వేషం వేస్తున్నారా?"

"లేకపోతే స్క్రిప్ట్ ఎందుకు తెచ్చేనంటావు?"

"నేను చదవడానికి!"

"అది ఎప్పుడూ వుందిలే. పది రోజుల్లో రిహార్సిల్. నువ్వు పూర్ణిమ రోలు చదూ. నాకు ప్రాక్టీసు సులువు అవుతుంది."

"అలాగే. పూర్ణిమ ఎవరు వేస్తున్నారు?"

"ఇంకా తేలలేదు. నువ్వు వెయ్యరాదూ?" సగం సీరియస్‌గానూ, సగం నవ్వుతాలుగానూ అన్నాడు శరత్.

"నాటకం చూసి అంత జరిగింది. ఇంక నేను స్టేజి మీదకి కూడా వొస్తే..." అంది నవ్వుతూ రేవతి.

అంతా జ్ఞాపకం వొచ్చి శరత్ కూడా నవ్వేడు. రేవతి సులువుగా నవ్వగలదు. శరత్ అలాగ కాదు. కాని రెండేళ్ళ కిందట ఇలాగే వార్షికోత్సవంనాడు వేసిన నాటకంలో శరత్ చాలా గంభీరమైన పాత్ర ఒకటి వేశాడు. దానిలో అతను ఒక ప్రేమికుడిగా చాలా గొప్పగా నటించాడు. ట్రాజెడీ నాటకం. అంతా పూర్తి అయేసరికి శరత్‌కే మనసంతా వికలం అయిపోయింది. అతన్ని కంగ్రాచులేట్ చెయ్యడానికి చాలామంది వచ్చారు. అందరికీ ఎలాగో సమాధానం చెప్పి పంపాక రేవతి వొచ్చింది.

ఆమెని చూస్తూనే "మీకు నాటకం నచ్చినందుకు సంతోషం. మీరు శ్రమ తీసుకుని వొచ్చినందుకు థాంక్స్!" అన్నాడు శరత్ యాంత్రికంగా.

రేవతి నవ్వి "మీవి డైలాగులు కావు. సోలోలు" అంది.

"నన్ను విమర్శించడానికి వొచ్చారా?" అన్నాడు శరత్ ముఖం తడిగుడ్డతో తుడుచుకుంటూ.

"అవును..."

"నాటకం మీకు నచ్చలేదా?"

"లేదు."

"ఐతే డైరెక్టర్‌గారితో చెప్పండి. గ్రీన్ రూమ్‌లో

వున్నారు."

"నేను మీతో మాట్లాడాలని వొచ్చాను. రెండు నిమిషాలు. రెండు ప్రశ్నలు... అంతే!"

ఆమె వాయిస్ చలా స్వీట్‌గా వుందని అనిపించింది అతనికి. అంతే కాదు, ఆమెలో ఏదో మెత్తటి ఆకర్షణ వుంది. ఈ లక్షణాలు నాటకంలో తనతో నటించిన యువతికి వుంటే అందరి కళ్ళూ ఆమె మీద వుండేవి అన్న ఆలోచన వొచ్చింది అతనికి.

"మీరు నాటకాలలో వేస్తూ వుంటారా?" అన్నాడు శరత్.

"నో. సరదా అంతే..."

"ఏం చేస్తూ వుంటారు?"

"కథలు రాస్తూ వుంటాను."

"ఓ!" అన్నాడు కొత్త గౌరవంతో శరత్.

"కవితలు కూడాను."

"అంటే సాహిత్య సేవ అన్నమాట! ఏ పేరుతో రాస్తూ వుంటారు?"

"నా పేరుతోనూ లేక పెన్ నేమ్‌తోనూ..."

"మీ పేరేమిటి?"

"చాలాసేపు పట్టింది మీకు ఆ మాట అడగడానికి..." అంది రేవతి.

"చెప్పండి. మరి... నా పేరు శరత్..."

"రేవతి..."

"మీరు రెండు ప్రశ్నలడుగుతానన్నారు—"

"ఇంతసేపూ మీరే అడుగుతున్నారు. నా ప్రశ్నలు మరిచిపోయాను- మీ పాత్రని మీరు పోషించిన విధం నాకు చాలా నచ్చింది. ఒకటి, రెండు చోట్ల తప్ప..."

"ఎక్కడ?"



"మరో రోజున చెప్తాములెండి. మీరిచ్చిన రెండు నిమిషాలు ముగిశాయి."

అలాగ పరిచయం అయింది వాళ్ళకి. నాటకీయత లేకుండానే పెద్దలు ఆ చిన్నవాళ్ళని దంపతులుగా చేశారు.

ఆ తరవాత సాఫీగానే సాగిపోతూంది వాళ్ళ జీవితం. అతను అయిదారు నెలలకొకసారి ఏదో ఒక నాటకంలో చిన్నదో, పెద్దదో వేషాలు వేస్తూనే వున్నాడు. ఆమె చాలా సహకరిస్తూనే వుంది.

ఈసారి నాటకంలో అతను వేస్తూన్న పాత్ర చాలా ప్రేమ సంభాషణలతో నిండి వున్నా ముందర రేవతి ఏమీ అనలేదు. మొదటి రిహార్సిల్‌కి వొచ్చినప్పుడు ఆమెకి నళినిని పరిచయం చేశాడు శరత్. ఆ తరవాత రెండు రిహార్సిల్స్‌కి ఆమె రాలేదు. ఈ లోపున నళిని స్వంత కారణాల వలన నాటకం డైరెక్టరుగారి ఆశీస్సులతోనూ విరమించుకుంది. ఆమెకి బదులుగా పూర్ణిమ వొచ్చింది. ఆమాట రేవతితో చెప్పేడు శరత్.

"బాగా చెయ్యగలదా?" అని అడిగింది రేవతి.

"ఈ రోజు అంత బాగా చెయ్యలేదు."

"మరి ఆమె నెందుకు తీసుకున్నారు?"

"మంచి ఆర్టిస్టట. డైరెక్టర్ చెప్పేడు-"

ఆ తరవాత పూర్ణిమ ప్రసక్తి తేలేదు శరత్. ఇంక నాటకానికి పది రోజులున్నాయనగా ఒకనాడు రేవతి రిహార్సిల్స్‌కి వొచ్చింది. ఆమెకి పూర్ణిమని పరిచయం చేశాడు శరత్.

నిండు చిరునవ్వుతో "మీరు చాలా మంచి ఆర్టిస్టు అనే చెప్పారు మావారు. ఇంత అందంగా వుంటారని చెప్పలేదు" అంది రేవతి. శరత్ ఆశ్చర్యపడ్డాడు. పూర్ణిమని గురించి



పిస్తోలు బాబు
సత్యప్రభ-హైదరాబాద్

అతను రేవతి కలాగ ఏమీ చెప్పలేదు. కథలు రాసే అలవాటులే, అనుకున్నాడు. రేవతి కథలు ఎక్కడా అచ్చు అవలేదని వాళ్ళిద్దరి తొలి ఏకాంతంలోనే అతనికి తెలిసింది.

రిహార్సిల్ పూర్తి అయ్యాక రేవతి పూర్ణిమని ఇంటికి పిలిచింది. నాటకం అయ్యాక ఏదో ఒక రోజున వస్తానంది పూర్ణిమ. ఆ తరవాత రేవతి సరదాగా చివరిదాకా వుంది.

ఇంటికి రాగానే రేవతి "మీరు ఈ నాటకం నుంచి విరమించుకోకూడదూ?" అంది ఉపోద్ఘాతం లేకుండా.

అదిరిపడ్డాడు శరత్.

"ఏమిటంటున్నావు రేవతీ?... ఓ! హాస్యమా?" అన్నాడు.

"కాదు. మీరు ఏదో కారణం చెప్పి తప్పించుకోండి" అంది రేవతి.

"ఎందుకని? కారణం చెప్పు" అన్నాడు శరత్ విస్మయంగా. అప్పటి దాకా ఆమె ప్రవర్తనకీ, ఈ మాటలకీ ఏమీ పోలిక లేదు. అతనికేమీ బోధపడలేదు.

"చెప్పే కారణాలు - మీరు తెలుసుకోవాలి. విరమించుకోండి ఈ నాటకం నించి."

"ఎందుకని? ఏం కారణం?"

"నేను అడుగుతున్నాను కనక... అది చాలదా?"

"కాని ఎలాగ? పది రోజుల్లో ఈ పార్టు తీసుకుని వెయ్యమంటే ఎవరి తరం? నా మర్యాద పోదూ?"

"పోదు. మర్యాద మీ ఒక్కరిదే కాదు."

అతనేం చెప్పినా ఆమె వినిపించుకోలేదు.

ఇంట్లో ప్రచ్ఛన్న యుద్ధం. ఈ పది రోజులూ ఎలాగ గడిచేయో అతనికే తెలీదు. అశాంతిగా, అసంతృప్తిగా గడిచే గంటగంటానూ. రేవతి ఎందుకు ఈ వైఖరి అవలంబించిందో అతనికి తెలీదు. కాని అస్పష్టంగా ఆమెకి పూర్ణిమ విషయంలో ఏదో శంక వుందని అతనికి అనిపించింది. కాని, అది కూడా నిజమైన కారణం కాదని అతని నమ్మకం. పూర్ణిమ అందగత్తె కావొచ్చును. కాని, రేవతికి అనుమానాలు కలగడానికీ, ఆమె భయపడడానికీ అది కారణం ఎలాగ అవుతుంది? రేవతిది తక్కువ అందం కాదు. శరత్ చరిత్రలోకాని,




ప్రవర్తనలోకాని ప్రేమాయణాలూ, పక్క చూపులూ లేవు. ఆ సంగతి రేవతికి తెలిసే వుండాలి.

ఆలోచిస్తూనే శరత్ థియేటర్‌కి చేరుకున్నాడు. అందరూ అతనికోసం ఆత్రంగా చూస్తున్నారు.

"రేవతిగారు రాలేదా?" అని అడిగింది పూర్ణిమ.

"తరవాత వొస్తుంది..." అని అబద్ధం ఆడేడు శరత్.

అక్కడ ఉన్నాడే గాని అతని ఆలోచనలన్నీ రేవతి మీదనే వున్నాయి. ఆమె రాజీ ఇంటికి వెడతాననడం అతనికి ప్రత్యేకం ఆశ్చర్యం కలిగించింది. ఆమెకి రాజీ అంటే పడదు. లాంఛనప్రాయంగా వాళ్ళిద్దరూ స్నేహితులు. కాని సురేష్ అంటే ఆమెకి విపరీతమైన ద్వేషం. అతను కనిపించిన ప్రతి ఆడదానితోనూ సరసం మొదలుపెడతాడనీ, అందరు ఆడ వాళ్ళూ అతని మీద కోరికతో కృశించిపోతున్నారని అతను కుంటాడనీ రెండు మూడు సార్లు రేవతి అన్నది. వాళ్ళింటికి ఆమె వెళ్ళడం ఇది రెండోసారి.

ఏడుకి అనుకున్న నాటకం ఎనిమిదికి ప్రారంభించారు. రంగం మీద అడుగు పెట్టగానే శరత్ మిగిలిన విషయాలన్నీ మరిచిపోయాడు. అతను శరత్ కాదు. తనని ప్రేమించి తనకి ప్రాణం కన్నా ఎక్కువ అయిపోయి హఠాత్తుగా అతనికి శత్రువు అయిపోయిన అర్చనని ద్వేషించి దూరంగా వుంచ లేకా, ప్రేమించినా దగ్గరికి తీసుకోలేకా ఆశక్తుడైన ప్రేమికుడు గోపీ అతను. అంతే.

పూర్ణిమ బాగా నటించింది. కాని, కరతాళ ధ్వనులూ, ప్రశంసలూ అన్నీ శరత్‌కే ఎక్కువ వచ్చాయి. నాటక బృందం వాళ్ళందరూ అతనిని కౌగలించుకుని తమ సమాజానికే అతను కీర్తి తెచ్చాడని ప్రశంసించారు. అతనికి రేవతి జ్ఞాపకం రావడంతోనే వీలైనంత త్వరగా వెళ్ళిపోవాలని అనిపించింది. అందరినీ వొదిలించుకుని మేకప్ తీసి బయలుదేరగలిగే సరికి రాత్రి పదకొండు దాటింది.

అతను బయలుదేరబోతోంటే ఎవరో అతన్ని పిలిచారు. అతని స్నేహితుడే - "పూర్ణిమగారిని డ్రాప్ చెయ్యగలరా?" అంటూ అభ్యర్థించాడు.

గడియారం చూసుకున్నాడు శరత్.

"టాక్సీ ఏదీ దొరకలేదు శరత్‌గారూ" అన్నాడు అతను. ఇంతలో పూర్ణిమ కూడా రానే వొచ్చింది.

"మీకు శ్రమ ఇస్తున్నందుకు క్షమించాలి. ఇంత ఆలశ్యం అవుతుందనుకోలేదు" అంది.

"ఫరవాలేదు. రండి" అన్నాడు శరత్. మర్యాదగా తప్పించుకునే దారి ఏదీ అతనికి కనిపించలేదు.

పూర్ణిమ ఇల్లు రెండో దిశలో వుంది. ఎలాగ లేదన్నా పది కిలోమీటర్లు తక్కువ వుండదు.

రాత్రి ఆలశ్యం అయినా రోడ్డుమీద కొంతమంది మనుషులు ఉండడం శరత్‌కి కొంచెం మెరుగు అనిపించింది. పూర్ణిమ ఏమో మాట్లాడుతోంది. గుండెలకి చల్లగా గాలి తగులుతోంది. పిలియన్ సీటు మీద కూర్చున్న పూర్ణిమ వెచ్చగా మెత్తగా తెలుస్తోంది. అతను రేవతి గురించి ఆలోచిస్తూ ఆమె చెప్పేవి పరధ్యానంగా వింటున్నాడు.

"నిజమేనా?" అంది పూర్ణిమ అతని చెవి దగ్గరగా.

"సారీ. మీ మాట వినలేదు" అన్నాడు శరత్.

" అదే అనుకున్నాను." అంది పూర్ణిమ.

"ఏమిటి?"

"ఇంటికి వెళ్ళేక చెప్తాను..."

మరో పది నిమిషాలలో ఇంటికి చేరేరు.

"కాఫీ తాగి వెళ్ళండి" అంది పూర్ణిమ.

"ఒద్దు. ఇంటికి వెళ్లాలి" అన్నాడు శరత్.

"అంత అసహాయ పరిస్థితిలో పెట్టకండి. సాయంత్రం మీరేమీ తినలేదు. ఈ అర్ధరాత్రి మీరు రాకపోతే చాలా యాతనగా వుండేది... కనీసం కాఫీ అయినా ఇవ్వనివ్వండి" అంది పూర్ణిమ.

అతను కాదనలేకపోయాడు.


ఇంజను ఆపి లోపలికి వెళ్లేడు. పూర్ణిమ తల్లి ఆమె కోసం కాసి పెట్టుకుని వుంది. హాలులోనే కూర్చుని వుంది. ఇంట్లో ఇంక ఎవరూ వున్నట్టు లేదు.

"ఇంత లేటయిందేమమ్మా! తొమ్మిదిన్నరకే అన్నవొండి వుంచాను" అంది ఆవిడ.

జరిగినదంతా చెప్పింది పూర్ణిమ. అతనికి ధన్యవాదాలు చెప్పి అతన్ని కూడా భోజనం చెయ్యమంది.

"ఒద్దండీ, ఇంట్లో చూస్తూ వుంటారు" అన్నాడు శరత్.

ఆ మాట అనగానే అతనికి రేవతి నాటకానికి రాకపోవడమూ, ఆ విషయం అందరికీ ముఖ్యంగా పూర్ణిమకి తెలియడం మనసులోకి వచ్చింది. సాయంత్రం ఆమె వస్తుందని చెప్పేక ఆమె రాకపోవడానికి కారణాలు వెతకడం అతనికి ఇబ్బందిగా తోచింది.




కాని పూర్ణిమ ఆ విషయంలో ప్రశ్నించలేదు. కాఫీ చేసి తెచ్చి ఆమె తల్లి వెళ్లిపోయింది.

కాఫీ తాగేసరికి శరత్ ప్రాణం లేచివచ్చింది. ఒళ్ళంతా చెమటగా వుండి స్నానం చేస్తే బాగుండుననిపించింది.

"థేంక్స్! వెళ్ళివస్తాను" అన్నాడు శరత్.

"కొంచెం సేపు వుండి వెడితే బాగుండేది. కాని మిమ్మల్ని ఆపడానికి ఇది సమయం కాదని తెలుసును" అంది పూర్ణిమ.

"గుడ్‌నైట్ చెప్పి అతను స్కూటరు స్టార్టు చేయబోయాడు. ఎన్నిసార్లు ప్రయత్నించినా లాభం లేకపోయింది. చెమటతో అతని షర్టు తడిసిపోయింది. పావుగంట ప్రయత్నించి విసిగిపోయాడు. అతనికి మెకానిజమ్ గురించి ఏమీ తెలీదు.

"కొంచెం సేపు రెస్టు తీసుకోండి" అంది పూర్ణిమ.

"దగ్గర ఏది గరాజీ లేదా?" అన్నాడు శరత్.

"ఉందనుకోను. ఉన్నా ఈ సమయంలో ఎవరుంటారు?" అంది పూర్ణిమ.

నీరసంగా అతను ఇంట్లోకి వెళ్ళాడు.

పూర్ణిమ అతని స్నానానికి ఏర్పాట్లు చేసింది. అతను ముందు వద్దన్నా, లోలోపల బురదగా వున్న శరీరాన్ని భరించలేక ఇష్టంగానే ఆమె ఆహ్వానాన్ని స్వీకరించాడు.

అతను రాగానే డ్రెసింగ్ టేబిల్ దగ్గరికి వెళ్లి "మీ షర్టు ఇవ్వండి- చాలా తడిగా వుంది. అందాకా మా బ్రదర్ కుర్తా ఇస్తాను" అంది షర్టు తీసుకుంటూ పూర్ణిమ. అది ఆమెకి ఇచ్చి అతను కొంచెం పౌడరు ఒంటికి రాసుకుని వచ్చి హాల్లో కూర్చున్నాడు. చుట్టూ నిశ్శబ్దం. ఆమె స్నానానికి వెళ్లినట్టు వుంది. కొంచెం దూరంగా నీళ్ళు పడుతున్న శబ్దం ఆ పరిసరాలలో స్పష్టంగా వినిపిస్తోంది.

రేవతి ఏమిటి చేస్తోందో! రాజీ ఇంటి నుంచి వచ్చి తన కోసం ఎదురు చూస్తూందేమో! భోజనం చేసిందో లేదో!

ఇలాగ ఈ సమయంలో ఈ యువతితో గడుపుతూన్న నిమిషాలని రేపు రేవతికి ఎలాగ చెప్పాలి? ఆమె ఇప్పటికే పూర్ణిమ విషయంలో అనుమానంగా వుంది. జరిగినది నిజంగా చెప్తే ఆమె నమ్ముతుందా?

ప్రశాంతంగా కూర్చుని ఇవన్నీ ఆలోచిస్తూంటే అతనికి చాలా దిగులుగా వుంది. రేవతి అంటే అతనికి ప్రాణం. ఆమెకీ తానంటే అంతేనని అతనికి తెలుసును. తమ ఇద్దరి చిన్న ఈ సంసారంలో ఈ మధ్యనే ఆరంభం అయిన చిన్న అలలు పెద్ద తరంగాలు అయిపోతాయా?

అతనికి దిగులు ఎక్కువ అయింది.

స్కూటరు అక్కడ ఒదిలేసి నడిచి అయినా సరే ఇంటికి వెళ్లిపోవాలని అతనికి ఒక్కసారి అనిపించింది.

కాని అది సాధ్యం కాని పని అని అతను వెంటనే గ్రహించాడు. అర్ధరాత్రి సమయంలో ఒంటరిగా వెళ్లాలి. ఈలోగా షర్టు కూడా రావాలి...

"రండి! భోజనం చేద్దాం" అంది పూర్ణిమ.

"మీకు చాలా శ్రమ అయింది..." అన్నాడు లేచి నిలబడి శరత్. ఆమె శుచిగా అప్పడే విరిసిన గులాబిలాగ వుంది. మేకప్ వెయ్యకుండా ఆమెని నటించనిచ్చి వుంటే ఇంకా ఎంతో ప్రశంస ఆమెకి వచ్చివుండును అనుకున్నాడు శరత్.

అతనికి ఆకలిగా వున్నా అలసటతో ఎక్కువ ఏమీ తినలేకపోయాడు. దానికితోడు పూర్ణిమ వాడిన పర్‌ఫ్యూమ్ పరిమళాలూ, ఆమెలోని ఆకర్షణా అతన్ని ఊపిరి తీసుకోనివ్వ లేదు.

"మీరేమీ తినడం లేదు" అంది పూర్ణిమ.

"మీరూ అంతే. ఆలశ్యం, అలసటా కలిసి ఆకలిని

చంపేశాయి'' అన్నాడు శరత్.

ఆమె చిరునవ్వుతో ''నాటకంలో సహజత్వం ఉండా లంటారు. మీ సహజత్వంలో నాటకీయత వుంది. అందుకే మీ డైలాగులు అంత బాగా వస్తాయి'' అంది.

''అదేం లేదు. మీరు అభిమానం కొద్దీ అలా అంటారు కాని, ఈ రోజు మీరు చాలా కష్టమైన అర్చన పాత్రని ఎంత నిజాయితీతో పోషించారో నాకు తెలుసును. వాళ్ళందరికీ తెలుసును'' అన్నాడు శరత్. అందులో చాలా వరకు నిజం వుంది.

''మీరు రెండో దశలో చేసిన నటన నటనలాగ లేదు. బాధపడే ప్రేమికుడిగా మీతో స్టేజీమీద ఎవరూ పోటీ పడలేరు!'' అంది పూర్ణిమ చాలా సిన్సియర్‌గా.

అతను తల అడ్డంగా ఊపి ఊరుకున్నాడు. తాను ఆ నిమిషాలలో నిజంగానే బాధపడ్డాడు. అర్చనలో అతనికి రేవతి మాత్రమే కనిపించింది. అందుకే అంత సహజంగా చెయ్యగలిగాడు. కాని అదంతా ఆమెకెలాగ చెప్పగలడు? ఎవరికేనా ఎలాగ తెలుస్తుంది?

నాటకం గురించి మాట్లాడడం అతనికి ఇష్టం లేక పోయింది. రేవతి ఎప్పటిలాగా తనతో నవ్వుతూ హాయిగా వుంటే మళ్లీ నాటకాల జోలికి పోకపోయినా బాధ లేదని అతను నిర్ధారించుకున్నాడు. ఈ ప్రశాంత వాతావరణంలో అతన్ని పూర్ణిమ ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. శిలాటి ప్రమా దాన్ని ఆనాడే పసిగట్టింది రేవతి. ఆమె మనస్సులో తనమీద ఎంత ప్రేమ లేకపోతే ఆ దూరపు గుర్తును గమనించగలిగి వుండేది!

భోజనాలయాయి.

''నిద్ర పొండి. నేను ఉదయమే లేపుతాను'' అంది పూర్ణిమ అతని దగ్గిరగా నిలబడి.


అతని మనసునిండా రేవతి లేకపోతే ఆ క్షణం ఏం జరిగేదో!

''అలాగే! మీరు వెళ్లిపొడుకోండి. నాకు సోఫా చాలు...'' అన్నాడు శరత్.

''అతిథిని అలాగ అమర్యాద చెయ్యలేను. మీరు నా బెడ్ రూములో పడుకోండి. నేను ఇక్కడో, అమ్మదగ్గరో పడు కుంటాను.'' అంది పూర్ణిమ.

తనలాగే ఆమె కూడా ఎండిపోయిన గొంతుకతో మాట్లా డుతోంది.

''నాకు నిద్ర రాదు- సోఫా చాలు. ప్లీజ్!''అన్నాడు శరత్. అతనికి ఆ నిమిషం ఎంతో పెద్దదిగా కనిపించింది.



కాళీయ మర్దనం
-శర్మ. సి.హెచ్

అయిష్టంగానే పూర్ణిమ వెళ్లిపోయింది. చాలా మెల్లగా నడుస్తూ.

శరత్ తన షర్టు మాట అడగడం మరిచిపోయాడు. కాని దానికోసం ఆమెని పిలవడం చాలా ప్రమాదకరం అని అతనికి తెలుసును. తన చెయ్యి రెండు అంగుళాలు కదిలి వుంటే కథ ఈపాటికి చాలా దూరం వెళ్లి వుండును. మళ్ళీ ఆ కత్తి అంచున అడుగులు వెయ్యడం అతనికి ఇష్టం లేదు.

అతనికి ఎక్కువ నిద్ర పట్టలేదు. నాలుగున్నరకి లేచి తలుపు తీసుకుని బయటికి వచ్చాడు.

చాలా చల్లగా వుంది.

అతను తలుపు తీసిన శబ్దానికి పూర్ణిమకి కూడా తెలివి వచ్చినట్టు వుంది.

''చాలా చల్లగా వుంది కదూ?'' అందామె.

''అవును- మీరు చాలా త్వరగా లేచారే!'' అన్నాడు శరత్.

''మీలాగే!'' అంది ఆమె. అతను నవ్వి ఊరుకుని స్కూటరు దగ్గరకి వెళ్ళి స్టార్టు చేశాడు. రెండో కిక్‌కి అది స్టార్టు అయింది.

''గుడ్! మరి నేను వెడతాను'' అన్నాడు శరత్.

''ఇంకా చీకటిగానే వుంది!'' అంది పూర్ణిమ.

''ఫరవాలేదు. ఈ దీపం వుందిగా!'' అన్నాడు బయలు దేరుతూ. ఆమె ఏదో అంది. అతనికి వినిపించలేదు.

శరత్ స్కూటర్‌ని చాలా వేగంగా నడిపించేడు. పావు గంటలో ఇల్లు చేరేడు. రేవతి ఆలశ్యంగా లేస్తుంది. కాని ఆమెని ఈ పరిస్థితుల్లో ఇబ్బంది పెట్టక తప్పదు.

అతను తలుపు కొట్టబోతుంటే ఆమె తలుపు తీసింది.

ఆమె నిద్రపోయినట్టులేదు.

''ఏమైంది?'' అంది రేవతి లైటు వేసి అతన్ని పరిశీలనగా చూస్తూ.

మంచంమీద కూర్చుని జరిగినదంతా చెప్పేడు శరత్.

నిజమా అని రేవతి అడగలేదు.

''పళ్లు తోముకోండి. కాఫీ తెస్తాను'' అంది లోపలికి వెడుతూ. ఆమె కళ్లలో ఎర్రదనమూ, బుగ్గలమీద ఎండిన కన్నీటి చారలూ చూసి అతను విలవిలలాడిపోయాడు. రేవతి ఎంత బాధ పడిందో! కాక తన మాటలన్నీ నమ్మిందో లేదో!

అతను బాత్‌రూమ్ నుంచి తిరిగి వచ్చాక మరో పది నిమిషాలకి రేవతి తిరిగి వచ్చింది. ట్రేలో రెండు కాఫీలు సువాసనలు వెదజల్లుతున్నాయి.

''ఆ కుర్తా తీసెయ్యండి... లుంగీ కట్టుకోండి''

అతను అప్పటిదాకా ఆ కుర్తా విషయమే మరచి పోయాడు. బట్టలు మార్చుకుని వచ్చి మంచం మీద కూర్చున్నాడు. ఆమె కూడా అతని ఎదురుగా కూర్చుని కాఫీ అందించింది. ఇద్దరూ నిశ్శబ్దంగా తాగారు.

''నిన్ను చాలా బాధ పెట్టాను రేవతీ! కాని మాట ఇచ్చాక కాదనలేక నిన్న నాటకంలో వేశాను. ఇంక వెయ్యను... నాటకాలకన్న నువ్వు ముఖ్యం నాకు'' అన్నాడు శరత్.

రేవతి చేతుల్లో ముఖం దాచుకుంది. ఆమె శరీరం గాలిలో లేత ఆకులాగ స్పందిస్తోంది.

''నా మాట నువ్వు నమ్మలేకపోవచ్చును. కాని అది నిజం... స్టేజి మీద తప్ప ఆమెని తాకలేదు నేను...''

రేవతిలో చలనం ఎక్కువ అయింది.

''అయామ్ సారీ... రేవతీ! ప్లీజ్!'' అన్నాడు శరత్ ఎంతో గాఢమైన బాధతో. ఆమె ముఖం మీద నించి చేతులు తియ్యలేదు.

''నువ్వేమైనా అను. కాని నేను నిన్నలాగ చూస్తూ వుండలేను'' అన్నాడు శరత్. అతనికి దుఃఖం వచ్చేస్తోంది.

ఆమె చేతులు పక్కకి తీసేదు సుళువుగా.

రేవతి పడిపడి నవ్వుతోంది.

''ఏం మగాళ్లండీ మీరు!'' అంది.

అతను రిలీఫ్‌తోను, ఆశ్చర్యంతోనూ మాట్లాడలేక పోయాడు.

''రాత్రి మీరు అంత చక్కగా నటించారు. నేనూ, రాజీ వచ్చాంలెండి. మీ వాళ్లకి తెలీదు. అక్కడకన్నా బాగా నటిస్తారనుకున్నాను కాని లాభం లేదు!'' అంది రేవతి.

''ఏమిటి నువ్వంటున్నది?''

''అదంతా తరవాత చెప్తాను లెండి. ఆదివారం కదా అని రోజంతా నిద్రపోక వెళ్లి పూర్ణిమని రాత్రిడిన్నర్‌కి పిలవండి''

''ఎందుకని?''

''ఆ మాత్రం తెలీదూ? మర్యాదలు పుచ్చుకున్నాక రిటర్న్ చెయ్యడం కనీస మర్యాద.. ఇంక నిద్ర పోతారా?''

అంది రేవతి.

''నువ్వూ నాటకాలలో చేరితేనే!'' అన్నాడు శరత్.

''మీలాగ నేను నటించలేను లెండి! కాని పూర్ణిమ పాటి బహుశా నేనూ...''

శరత్‌కి చాలా ఆలోచనలతో నిద్ర పట్టలేదు. మొట్ట మొదటిసారి అతనికి పూర్ణిమని తలుచుకోగానే బాధ కలి గింది.

మరి రేవతి నవ్వుతూనే వుంది.

